రాయనపాడులో రైలు దిగితే..

- రాయనపాడు శాటిలైట్ స్టేషన్ వద్ద ప్రయాణికుల అవస్థలు
- రైలు దిగిన ప్రయాణికులకు రోడ్డు రవాణా సదుపాయం కరువు
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న ఆటోలు
- ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఏర్పాటుకు వినతి



శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసిన రాయనపాడు రైల్వేస్టేషన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌కు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించే చర్యల్లో భాగంగా రాయనపాడు, గుణదల, రామవరప్పాడు రైల్వేస్టేషన్‌లను శాటిలైట్ స్టేషన్‌లుగా అభివృద్ధిపర్చేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు.

రూ.12.13 కోట్లతో..

అందులో భాగంగా రైల్వేశాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాయనపాడు రైల్వేస్టేషన్‌కు రూ.12.13 కోట్లతో ప్రపంచ స్థాయి అత్యాధునిక సదుపాయాలతో స్టేషన్ పునరాభివృద్ధి పనులు చేపట్టారు. ఈ రైల్వే స్టేషన్ దక్షిణ తీర ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై- బల్హార్షా- నాగ్‌పూర్- న్యూఢిల్లీ లైన్‌లోని గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉంది. అమృత్ పథకంలో దాదాపుగా పనులు పూర్తి చేసుకున్న ఈ స్టేషన్‌లో నాగ్‌పూర్, సికింద్రాబాద్ మార్గం నుంచి వరంగల్ మీదుగా విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా వైపు వెళ్లే అనేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు విజయవాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండా రాయనపాడు మీదుగా దారి మళ్లిస్తున్నారు. దీంతో విజయవాడ ప్రధాన స్టేషన్‌పై చాలావరకు ఒత్తిడి తగ్గుతుండటంతో రాయనపాడు రైల్వే స్టేషన్‌ను విజయవాడ బైపాస్ స్టేషన్ అనికూడా పిలుస్తున్నారు.

సమస్య ఇదీ..

విజయవాడకు సుమారు 10 మీటోమీటర్ల దూరంలో ఉన్న రాయనపాడు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేసుకోడంతో దాదాపుగా అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుస్తున్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతోంది. అయితే స్టేషన్‌కు వచ్చి వెళ్లేందుకు ఎటువంటి రవాణా సదుపాయాలు లేకపోవడంతో రైలు దిగిన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇతర ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తే ఒక్కొక్కరికి నుంచి రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు.



స్టేషన్‌కు చేరుకునేందుకు ఉన్న రహదారి

బస్సు సదుపాయాలు కల్పించాలి...

పేద, మధ్య తరగతి ప్రజలకు చవక ధరలతో వారి గమ్యస్థానాలకు చేరవేయడంలో రైల్వే రవాణ వ్యవస్థ పేరుగాంచింది. ఒక వ్యక్తి హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం రూ.175తో ప్రయాణం చేస్తే రాయనపాడు స్టేషన్ నుంచి విజయవాడకు చేరుకోవటానికి ఆటోలకు అధికచార్జీ చెల్లించాల్సి వస్తోంది. అన్ని సదుపాయాలతో రాయనపాడు స్టేషన్‌ను అభివృద్ధి పర్చిన రైల్వే అధికారులు స్టేషన్ నుంచి నగరానికి చేరుకోవడానికి రోడ్డు కనెక్టివిటీపై దృష్టి సారించి అన్ని వేళల్లో బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు ఏర్పాటు చేయాలి



రాయనపాడు రైల్వేస్టేషన్‌లో సదుపాయలు చక్కగా ఉన్నాయి. రైలు దిగి విజయవాడ స్టేషన్ చేరుకునేందుకు ఎటువంటి రవాణా సదుపాయాలు లేవు. చేసేది లేక ఆటోలను ఆశ్రయిస్తే ముగ్గురికి రూ.400 చార్జీ తీసుకున్నారు. రైల్వే అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సౌకర్యం కల్పించాలి.

– ఆకాష్, రైలు ప్రయాణికుడు

త్యాగానికి ప్రతీక బక్రీద్



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): బక్రీద్ పర్వదినం త్యాగానికి ప్రతీక అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. తోటి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సకల మానవాళి శాంతియుత జీవనం కొనసాగించాలని, పేదల ఆకలి దప్పికలు తెలుసుకొని వారికి అండగా ఉండాలని ఇస్లాం చెబుతుందన్నారు. బక్రీద్ పర్వదినం త్యాగానికి ప్రతీకగా ఇస్లాం గ్రంథాలు వివరిస్తున్నాయని తెలిపారు. తోటి మానవులందరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బక్రీద్ అందరికి మేలు చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

బక్రీద్ శుభాకాంక్షలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): త్యాగనిరతికి ప్రతీకగా నిలిచిన పవిత్ర ఈద్ ఉల్– అదాహ (బక్రీద్) సందర్భంగా ముస్లిం సామాజికవర్గానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త ఇబ్రహిం త్యాగనిరతికి గుర్తుగా జరుపుకునే బక్రీద్ పండుగ అందరికీ సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. మొహమ్మద్ ప్రవక్త బోధించిన కరుణ, సోదర భావం, సామరస్యం, సమైక్యతను అందరూ అనుసరించాలని కోరారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ముస్లిం సోదరుడి కుటుంబానికి జీవితాంతం అల్లాహ అనుగ్రహం, మొహమ్మద్ ప్రవక్త ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

ఎండీయూ వాహనాలను తొలగించటం దుర్మార్గం

వెలంపల్లిని కలిసిన ఎండీయూ ఆపరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఎండీయూ వాహనాలను తొలగించటం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో వెలంపల్లి శ్రీనివాసరావును ఎండీయూ వాహనదారులు కలిసి వాహనాలను కొనసాగించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల అవస్థలను తొలగించేందుకు తమ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన విప్లవాత్మక వ్యవస్థ 'ఇంటి వద్దకే రేషన్'ను కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారనే దుగ్ధతో, ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలను జీర్ణించుకోలేక కోట్లాది మంది పేదలకు సేవలందిస్తున్న ఎండీయూలపై, వలంటీర్లపై విషం చిమ్ముతున్నారన్నారు. ఆ వ్యవస్థలకే మంగళం పాడారని మండిపడ్డారు. ఎండీయూ వాహనదారులపై కూటమి ప్రభుత్వం కుట్రలు మానుకోవాలని, కరోనా లాంటి విపత్కర సమయంలో కూడా ఎండీయూ ఆపరేటర్లు ప్రజల ఇంటి వద్దకు సేవలందించారన్నారు. వారిని కూటమి ప్రభుత్వ నాయకులు దొంగలుగా చూడడం సరైన పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆగస్టు నెలలో సంభవించిన వరదలలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడ నగరం అతలాకుతలమైందని, అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం వినియోగించుకుందన్నారు. ఎండీయూ ఆపరేటర్లపై తీరును మార్చుకోవాలన్నారు. పునరాలోచన చేసి వారిని విధులలో కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందని తెలిపారు.



వెలంపల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు

వర్షాకాలానికి సమగ్ర ప్రణాళిక రూపొందించండి

అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి తనకు సమర్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్ శాఖాధిపతులు, సిబ్బంది, సచివాలయం సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎంసీ పరిధిలోని ఆయా సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని శాఖాధిపతులను ఆదేశించారు. నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలలో సచివాలయం, వార్డు, నియోజకవర్గ వారీగా వర్షం పడినప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తుతాయి, వాటికి పరిష్కారానికి తీసుకునే చర్యలు, శాశ్వత పరిష్కారానికి ఏం చేయాలి వంటి అంశాలతో పూర్తి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో, ప్రమాదకరమైన గుంతలు ఎక్కడున్నాయో, ఎన్ని ఉన్నాయి వంటి వాటిపై పూర్తి నివేదికను సమర్పించి నిర్దేశించిన గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. వర్షం పడినప్పుడు ఎక్కువగా రోడ్లపై నీరు నిల్వ ఉండే ప్రాంతాలను, రోడ్లు గుంతలు పడిన ప్రాంతాలను గుర్తించి వెంటనే వాటిని పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలను, వర్షపు నీటిని తోడేందుకు వాహనాలను కేటాయించాలని, అవి సరిపోకపోతే అదనంగా వాహనాలను సమకూర్చాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. వర్షం పడినప్పుడు రోడ్లలో ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండి ప్రజలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని, ప్రమాదకరమైన గుంతలు ఉన్న రోడ్లలో గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ చర్యలు తీసుకునే లోపు వర్షం కురిస్తే హెచ్చరిక బోర్డులను పెట్టాలని అన్నారు. నగరానికి వరదలు వస్తే ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ముందస్తుగానే వారికి సమాచారాన్ని అందించి పునరావాస కేంద్రాలకి తరలించేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు నగరంలో ఉన్న కాలువల్లో డీసిల్టింగ్ ప్రక్రియను శరవేగంగా నిర్వహించి పూర్తిస్థాయిలో డీసిల్టింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని, ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేయాలన్నారు. నగరంలో ఉన్న డ్రైన్‌లలోనే కాకుండా, ఆ డ్రైన్లు కలిసే అవుట్ ఫాల్ డ్రైన్ ప్రవాహం ఉన్న చివరి వరకు డీసిల్టింగ్ ప్రక్రియ జరగాలని అధికారాలను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ధ్యానచంద్ర

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ ఐరన్ యార్డ్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీ రవీంద్ర బాబు (విజయవాడ టౌన్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు హౌసింగ్ బోర్డ్‌కాలనీలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పాత ఎంఐజీ బ్లాకులు, ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్ యార్డ్, రిలయన్స్ పక్కన పడమటవారి వీధి ప్రాంతాలలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మలేరియా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల తన చాంబర్లో మలేరియా మాసోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో దోమలు ఉత్పత్తి చెందే అవకాశం ఉన్నందున, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఫ్రైడే– డ్రై డే గా పాటించాలని, నీటి నిల్వలు పరిసర ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలని, పూల కుండీలు, రిఫ్రిజిరేటర్ లోని నిల్వ ఉన్న నీరు, టైర్లు, ఖాళీ తొట్లు, రుబ్బురోళ్లు, పాడైపోయిన బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు శివరామకృష్ణ, సలీం, సోమరాజు, రమేష్ పాల్గొన్నారు.

వీఎంసీ కబేళాలో జంతువధకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

పటమట(విజయవాడతూర్పు): బక్రీద్ సందర్భంగా వీఎంసీ పరిధిలోని ప్రాంతాల్లో వీఎంసీ నుంచి లైసెన్స్ పొందిన స్లాటర్‌హౌస్(కబేళా)లో తప్ప మరే ఇతర అనధికారిక వ్యక్తి, సంస్థలు జంతువధ చేయకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం బక్రీద్ సందర్భంగా పశువధ నిర్వహించుకోవటానికి నగరపాలక సంస్థ కబేళాలో అందుకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించామని వివరించారు. కబేళాకు ఎక్కువమంది కాకుండా కేవలం ఒక జీవానికి ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని, దీన్ని నగరవాసులు గమనించాలన్నారు. విజయవాడ నగరంలో గోహత్య నిషేధ చట్టం అమలులో ఉందని, దీని ప్రకారం ఆవులను చంపడం చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. నగరంలో బీఫ్ వ్యాపారులు విధిగా పై సూచనలు పాటిస్తూ, అధికారులతో సహకరించి ప్రభుత్వం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తమ వ్యాపారాలు చేసుకోవచ్చని సూచించారు.

మహిళ అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భర్తతో కలిసి ఊరు వెళుతూ మార్గ మధ్యంలో భార్య అదృశ్యమైన ఘటన భవానిపురం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన కోలా లక్ష్మణరావుకు తెలంగాణ రాష్ట్రం మునగాలకు చెందిన ప్రసన్నతో వివాహమైంది. మూడు రోజుల క్రితం కోర్టు పనిమీద విజయవాడ వచ్చి బంధువుల ఇంట్లో ఉన్నారు. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో భార్యాభర్తలు ఇరువురు కారులో మునగాల బయలుదేరారు. మార్గమధ్యంలో నల్లకుంట ఖలీల్ హోటల్ వద్ద కారు పార్క్ చేసి నిద్రపోయారు. 7.30 గంటలకు లేచి చూడగా భార్య కనిపించలేదు. ఫోన్ కారులోనే వదిలేసింది. చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీనిపై ఆమె భర్త లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. టేలర్‌పేట వీరయ్య వీధికి చెందిన జనమాల సునీతకు ఇద్దరు కుమారులు. సునీత భర్త రమేష్ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిస్తూ కొంత కాలం కిందట మృతిచెందడంలో కారుణ్య నియామకం కింద అతని పెద్దకుమారుడు నవీన్‌కుమార్‌కు ఉద్యోగం ఇచ్చారు. కొద్దికాలంగా నవీన్‌కుమార్‌కు, అతని భార్య చైతన్యకు గొడవలు జరగడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో చైతన్య తల్లిదండ్రులు, బంధువులు గురువారం ఉదయం సునీత ఇంటికి వచ్చి నోటికి వచ్చినట్లు దూషించడమే కాకుండా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చైతన్య తల్లి రత్నసులోచన, చిన్నమ్మ రవణతోపాటు మరి కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో ఈవో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈవో శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని స్కానింగ్, టికెట్ పంచింగ్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దీంతో ఉదయం 10–30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను రద్దు చేశారు. రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు రూ.300, రూ.100, సర్వ దర్శనం క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏఈవో చంద్రశేఖర్ రద్దీకి అనుగుణంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు కల్పించారు. మరో వైపున ఈవో శీనానాయక్ గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్, ఆలయ ప్రాంగణంలోని టికెట్ పంచింగ్ పాయింట్‌లో భక్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరూ తప్పని సరిగా టికెట్ కొనుగోలు చేసేలా చూడాలని ఈవో ఆదేశించారు. అనంతరం రాజగోపురం వద్ద ఉచిత ప్రసాదాల పంపిణీని పరిశీలించారు. ఉచిత ప్రసాదాల వద్ద భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



టికెట్ పంచింగ్ పాయింట్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో శీనానాయక్

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి : సీఐటీయూ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ సుప్రజ, జిల్లా నేత ఎం.సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్‌ను యధావిధిగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వం నిబంధనల పేరుతో ఆయాలను తొలగించడం సరైనది కాదన్నారు. ఇచ్చే అతి తక్కువ వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం తగదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. 300మంది విద్యార్థులకు ఒక ఆయా నిబంధన కారణంగా వందలాది మంది ఆయాలు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఈ నిబంధనలను ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు. ఆయాలకు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపచేయాలని, యూనిఫామ్, గుర్తింపుకార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమస్యల పరిష్కరించాలని కోరారు.



డీఈవో సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నేతలు

హెల్మెట్ వాడితే ప్రాణాలకు భరోసా

మూడవ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు భరోసా ఉంటుందని మూడవ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె.కిశోర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం సత్యనారాయణపురం పరిధిలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారు, హెల్మెట్‌ను సరిగా ధరించని వాహనదారులను గుర్తించి హెల్మెట్ ధరించే సరైన విధానాన్ని డెమో రూపంలో చూపించారు. అనంతరం వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, బీమా తదితర డాక్యుమెంట్లు పరిశీలించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనలు, అతివేగం, హెల్మెట్ వాడకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి వారిని ఆటోమేటిక్‌గా గుర్తించి ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.వి.ఎస్. కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ కిశోర్‌బాబు

దివ్యాంగుల ఆశ్రమానికి రూ.10 లక్షల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రమానికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సముద్రాల వెంకట రమణ రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశాజ్యోతి ఆశ్రమాన్ని సందర్శించారు. శారీరక, మానసిక దివ్యాంగులు, అనాథ బాలలకు ఆశాజ్యోతిలో అందిస్తున్న సదుపాయాలను వెంకట రమణ పరిశీలించారు. ఎంతో ఓర్పుతో దివ్యాంగులు, అనాథ బాలలకు వసతి సదుపాయాలు కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. తనవంతుగా ఆశాజ్యోతి ఆశ్రమానికి రూ.10 లక్షల విలువైన చెక్కును అందించారు. భవిష్యత్‌లోనూ తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. భారీ విరాళాన్ని అందించినందుకు ఆశాజ్యోతి వ్యవస్థాపకుడు మరీదు వెంకట స్వామి, కరస్పాండెంట్ మల్లవల్లి మాధవీలత కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సముద్రాల వెంకట రమణ జన్మదినాన్ని దివ్యాంగ చిన్నారుల సమక్షంలో జరుపుకున్నారు. అనంతరం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుముద్రాల వెంకట రమణ కుమార్తె భానురేఖ, ఇతర కుటుంబ సభ్యులు, ఆంధ్ర హాస్పటల్స్ డైరెక్టర్ కామినేని అచ్యుత్ బాబు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు (స్వామి) పాల్గొన్నారు.

అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా బత్తుల పాండు, చేనేత వింగ్ అధ్యక్షుడుగా జగిలింగి రామ్‌కుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కొమ్మూరు శ్రీబద్రినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆపార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జగన్మాతకు నృత్యార్చన




ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నందికొట్కూరుకు చెందిన శ్రీలిఖిత శ్రీనృత్య కళాశాలకు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై డి.సాయి లిఖిత పర్యవేక్షణలో 9 మంది విద్యార్థులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నమాజ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పర్వదినం రోజున పొట్టేలు మాంసాన్ని పేదలకు అందించడం ఇస్లాం సంప్రదాయం. అందులో భాగంగా గొర్రెపోతుల విక్రయాలతో పంజా సెంటర్ సందడిగా దర్శనమిస్తూ ఉంటుంది. పంజా సెంటర్‌తో పాటుగా వించిపేటలోని పలు ప్రాంతాల్లో గొర్రెపోతుల విక్రయాలతో ఆయా ప్రాంతాల కళకళలాడుతున్నాయి. పండుగ సందర్భంగా భవానీపురం, విద్యాధరపురం, చిట్టినగర్ ఈద్గాతోపాటుగా గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లో నమాజ్‌లు చేసుకునే విధంగా టెంట్లు వేసి ఏర్పాట్లు చేశారు. ఆయా పరిసరాలల్లో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగరపాలకసంస్థ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిష్యత్తు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థి స్థాయి నుంచే యువత తమలోని నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలతో పాటుగా ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో ల్యాబ్ ఆన్ వీల్స్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు శుక్రవారం జరిగాయి. తరగతుల ప్రారంభం సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ సంస్థ వారు బస్సులో ఈ విధంగా సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. యువత తమలోని నైపుణ్యాలకు మరింతగా పదును పెట్టుకునేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతలో నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

భక్తులకు సదుపాయాల కల్పనకై అదనపు బాధ్యతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పించే మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు దేవస్థానం చర్యలు చేపట్టింది. దేవస్థానంలోని పలువురు అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ ఆలయ ఈవో శీనానాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వీరికి రోజు వారి విధులతో పాటు అదనపు విధులు నిర్వహిస్తారని ఈవో పేర్కొన్నారు. ప్రసాదాల నాణ్యత, సరుకుల నాణ్యత పరిశీలన, నాణ్యత ప్రమాణాలపై నోడల్ అధికారిగా ఎఈవో ఎన్. రమేష్‌బాబును నియమించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు, కంట్రోల్ రూమ్ తనిఖీ, ఆపరేటర్ల విధుల నియంత్రణపై నోడల్ అధికారిగా దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావును నోడల్ అధికారిగా నియమించారు. దేవస్థానంలో భక్తులకు అవసరమైన సమాచార బోర్డులు, డిజైన్ తదితర పనులకు నోడల్ అధికారులుగా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె. గంగాధర్, డీఈ బి. అశోక్‌కుమార్‌ను నియమించారు. చంటి బిడ్డలకు పాలు ఇచ్చే బేబీ ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు, సౌకర్యాల పర్యవేక్షణకు డీఈ. బి. అశోక్‌కుమార్‌ను నియమించారు. దేవస్థానంలో భక్తులకు రక్షిత మంచినీరు అందించడం, నీటి పరీక్షలు, ట్యాంకులను శుభ్రపరచే అంశాలను పర్యవేక్షించేలా ఎఈ వి.కుటుంబరావును నోడల్ అధికారిగా నియమించారు. దేవస్థానానికి విచ్చేసే భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ, క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణకు ఎఈ సీహెచ్. సునీల్‌కుమార్, ఐటీ కోర్డినేటర్ పి. హరీష్‌ను నోడల్ అధికారిగా నియమించారు.

లారీ ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తపేట పోలీసుల కథనం మేరకు.. గన్నవరం చింతకుంటకు చెందిన లక్ష్మణ్‌కుమార్ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బైక్‌పై గురువారం జక్కంపూడి వెళ్తుండగా, వైవి.రావు రింగ్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. లక్ష్మణ్‌కుమార్ కాలి మీదుగా లారీ వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.